నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం | జులై 09, 2024 | www.navatelangana.com

పరిశుభ్రంగా ఉంచాలి

- కామారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడున్నటువంటి సమస్యలను ప్రొఫెసర్లను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, హాస్టల్ వసతులు ఎలా ఉన్నాయనీ అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కళాశాల చుట్టుపక్కల ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. మంచినీటి సౌకర్యం కల్పిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఎస్సై, రవీందర్ పర్వేజ్, జవాన్ వేణు, పాల్గొన్నారు.

పిచికారి డబ్బాలకు రిపేర్లు

- మెకానిక్ వద్ద క్యూలైన్



నవతెలంగాణ-మద్నూర్

ఉమ్మడి మండలంలో వానాకాలం పంట సాగులో భాగంగా సాగుచేసిన పెసర, మినుము, సోయా, కంది, పత్తి తదితర పంటలకు పురుగుల నివారణ కోసం పిచికారి చేసేందుకు పిచికారిమిషన్ డబ్బాలకు రిపేర్లు చేయించడానికి మెకానిక్ వద్ద క్యూ లైన్‌లో పెట్టారు. పంటలు సాగు చేసి 20 నుంచి 25 రోజులు అవుతుంది. పంటలు కలుపు తీసే విధంగా పెరిగాయి. మొదట పిచికారి కోసం సిద్ధమైన పంటలకు పురుగుల మందు పిచికారి చేయడానికి వ్యవసాయదారులు తమ వద్ద ఉన్న పిచికారిమిషన్ డబ్బలకు రిపేర్లు చేయించుకుంటున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్

లక్ష్యం 17.88 లక్షల మొక్కలు

- వనమహోత్సవంలో జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటాలి
- కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా వ్యాప్తంగా మొత్తం 17 లక్షల 88 వేల మొక్కలను వనమహోత్సవ కార్యక్రమంలో నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్టు కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్ తెలిపారు. లక్ష్యం మేర మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు పూర్తి చేసి జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి శాఖకు కేటాయించిన టార్గెట్‌ను తప్పకుండా పూర్తి చేయాలని అన్ని ప్రభుత్వ పాఠశాలలో, గురుకుల హాస్టల్లో మొక్కలు నాటించాలని తెలిపారు. ఆయా శాఖల అధికారులు ఫారెస్ట్, మున్సిపల్, గ్రామీణ అభివద్ధి శాఖ వారి నర్సరీల నుండి పొడవాటి మొక్కలు ఎంచుకున్న ప్రాంతాలకు తీసుకెళ్లి మొక్కలు నాటాలన్నారు. అలాగే అవెన్యూ ప్లాంటేషన్ సైతం ఆకర్షించే విధంగా పచ్చదనం పరిమళించేలా మొక్కలను ఎంచుకొని నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్డీఓ చందర్, డిపిఓ శ్రీనివాసరావు, సిపిఓ రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


హాజరైన వివిధ శాఖల అధికారులు

గ్రామీణ ప్రాంత..

ఆవిష్కర్తలకు సాధికారతే లక్ష్యం

- సరికొత్త ఆవిష్కరణలకు అనువైన వాతావరణం
- ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రతి ఏడాది తరహాలోనే ఈ ఏడాది కూడా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి ఆవిష్కర్తలు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆవిష్కర్తలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని అన్నారు. సరికొత్త ఆవిష్కరణలకు అనువైన వాతావరణం కల్పిస్తూ, ఆవిష్కర్తలను ప్రోత్సహించనున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఆవిష్కరణ కేంద్రం ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న ఇంటింటా ఇన్నోవేటర్-2024 కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ఆవిష్కరణ కేంద్రం ప్రస్తుతం 2024 ఎడిషన్ ఇంటింటా ఇన్నోవేటర్ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తులను స్వీకరిస్తోందని అన్నారు. అన్ని వర్గాలకు చెందిన ఆవిష్కర్తలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారు, వారి వినూత్నమైన ఆలోచనలు, ప్రాజెక్టులను సమర్పించవచ్చని సూచించారు. ప్రోత్సహిస్తున్నాము ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది మరింత విస్తృత స్థాయిలో చేపట్టనున్నారని తెలిపారు.

ఇప్పటి వరకు అత్యంత విస్తృతమైనదిగా ఉండబోతోందని అన్నారు. ఈ ఏడాది వచ్చిన ఆవిష్కరణలు అన్నింటిలో, గొప్ప ఆవిష్కరణలు అన్నింటికి ఆగస్టు 15న అవార్డు ప్రదానోత్సవం ఉంటుందన్నారు. గ్రామీణ ఆవిష్కర్తలను సాధికారపరచడంపై దృష్టి సారించి, ఈ కార్యక్రమం తెలంగాణ అంతటా 33 జిల్లాలన్నింటినీ కవర్ చేయాలని, మూడు వేల పైచిలుకు గ్రామ పంచాయతీలతో నిమగ్నమవ్వాలని, తద్వారా కోటి మందికి పైగా గ్రామీణ ప్రజలతో అనుసంధానం కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారని కలెక్టర్ వెల్లడించారు. ఈ ఏడాది కార్యక్రమంలో సరికొత్తగా జిల్లాకు ఒకరు చొప్పున 33 మంది యువ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమిస్తున్నారని తెలిపారు. ఇన్నోవేషన్ మిత్రాలుగా మూడు నెలల కాలానికి (జులై-సెప్టెంబర్ 2024) ఆన్-గ్రౌండ్ సమన్వయకర్తలుగా పనిచేసే ఈ మిత్రాలు, జిల్లా అధికారులు, ఎన్జీఓలు, పౌర సమాజ సంస్థలు, గ్రామీణ ప్రజలతో సహా విభిన్న వాటాదారులతో నిమగ్నమవడంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. తెలంగాణ మారుమూల గ్రామాల్లో కూడా నూతన ఆవిష్కరణల ప్రాముఖ్యతను తెలియజేస్తూ, సరికొత్త ఆవిష్కరణలను తీసుకురావటమే ఈ కార్యక్రమం లక్ష్యమని స్పష్టం చేశారు.

ఇంటింటా ఇన్నోవేటర్ 2024 కార్యక్రమం దరఖాస్తు ప్రక్రియ సులువుగా, అనుకూలంగా ఉండేలా రూపొందించబడిందని అన్నారు. ఆవిష్కర్తలు వారి దరఖాస్తులను నేరుగా వాట్సాప్ ద్వారా 9100678543 నెంబరుకు పంపించవచ్చని సూచించారు. దరఖాస్తులో పేరు, వయసు, ఫోటో, వృత్తి, గ్రామం, మండలం, ఆవిష్కరణ పేరు 100 పదాలకు మించకుండా ఆవిష్కరణకు సంబంధించిన వివరణ తప్పనిసరిగా పొందుపర్చాలని తెలిపారు. ఆవిష్కరణకు సంబంధించిన నాలుగు చిత్రాలు (హై రిజల్యూషన్), ఆవిష్కరణ పనితీరును ప్రదర్శించే రెండు వీడియోలు, అవసరమైన ఇతర మీ వివరాలు పంపించాలని అన్నారు. ఈ ఏడాది ఆగస్టు 3వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని, అదనపు సమాచారం కోసం సెల్ నెంబర్ 9441191829 ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కేజ్ వీల్స్‌తో

రోడ్లపైకి వస్తే చర్యలు

- జిల్లా ఎస్పీ సింధు శర్మ ఐపిఎస్



నవతెలంగాణ-కామారెడ్డి

ట్రాక్టర్‌లను కేజ్ వీల్స్‌తో బీటీ రోడ్లపై, సీసీ రోడ్లపై నడిపిస్తే రోడ్లు పాడవుతాయని, అలా ట్రాక్టర్‌లను కేజ్ వీల్స్ తో బీటీ రోడ్లు, సీసీ రోడ్లపై నడిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా ఎస్పీ సింధుశర్మ హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

ప్రభుత్వం ఎంతో వ్యయంతో ప్రజలకు మెరిగైన సుఖవంతమైన ప్రయాణం కోసం రోడ్లను ఏర్పాటు చేసిందని, కొందరు ట్రాక్టర్ యజమానులు పొలాల్లో పని చేయడానికి కేజ్ వీల్స్‌ను రోడ్లపై ఉపయోగించడం వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయని కాబట్టి ట్రాక్టర్ యజమానులు పొలాల్లో పనుల నిమిత్తం వెళ్ళేటప్పుడు తమ ట్రాక్టర్లను కేజ్ వీల్స్ తో రోడ్డుపై నడపవద్దని, అలా నడపడం వల్ల రోడ్డు డ్యామేజి అయి రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదన్నారు. ట్రాక్టర్ కేజ్ వీల్స్‌తో రోడ్లపైకి వచ్చే ట్రాక్టర్ యజమానులపై మోటారు వాహన చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, కాబట్టి ఇట్టి విషయాన్ని ట్రాక్టర్ యజమానులు గమనించాలని అన్నారు.

కార్పొరేషన్‌లకు చైర్మన్‌లు ఖరారు

- జిల్లా వ్యాప్తంగా నలుగురికి అవకాశం
- అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- బాధ్యతలు స్వీకరించిన ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డి


కాసుల బాలరాజు,


మానాల మోహన్‌రెడ్డి


బాధ్యతలు స్వీకరించిన అన్వేష్‌రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్/జుక్కల్

రాష్ట్ర వ్యాప్తంగా 35 కార్పోరేషన్‌లకు చైర్మన్‌లను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు నాయకులకు అవకాశం కల్పించిన విషయం విధితమే. అయితే బాల్కొండ నుంచి ఇద్దరు నాయకులకు, ఆర్మూర్, బాన్సువాడ నుంచి ఒక్కొక్కరికి కార్పోరేషన్‌లు దక్కడం విశేషం. పదవులు కట్టబెట్టడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కిసాన్‌కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్‌గా ఉన్న సుంకేటి అన్వేష్‌రెడ్డికి రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.అదే విధంగా రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్‌గా మాజీ విప్ ఈరవతి అనిల్ సైతం బాధ్యతలు స్వీకరిం చారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు హాజరై ఇరువురికి శుభాకాంక్షలు తెలియజేశారు.


మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఈరవత్రి అనిల్

కాగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి రాష్ట్ర కో ఆపరేటీవ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా, అదే విధంగా బాన్సు వాడ నాయకులు కాసుల బాల్‌రాజ్‌కు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్‌గా నియమించారు. వారు త్వరలో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసి ప్రమాణ పత్రాలు అందజేశారు.

కాంగ్రెస్ శ్రేణుల హర్షం..

జుక్కల్ : రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా కాసుల బాల్ రాజ్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియమించి ప్రమాణ పత్రం అందించడం పట్ల ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రసిడెంట్ ఇస్పత్‌వార్ వినోద్ హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు గౌరవ ప్రదమైన స్థానం కల్పించినట్టు గుర్తు చేసుకున్నారు.

కార్పొరేషన్ నామినేటెడ్ పదవులపై సంబరాలు



నవతెలంగాణ-బాల్కొండ

తమ నాయకులకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు లభించడం పై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం మండల కేంద్రంలో ఘనంగా సంబరాలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మన్ గా ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్ తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ గా మానాల మోహన్ రెడ్డి నీ ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్ తెలంగాణ రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మన్‌గా సోమవారం హైదరాబాదులోని ప్రధాన కార్యాలయంలో తన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బాల్కొండ టౌన్ ప్రెసిడెంట్ సంజీవ్ గౌడ్ ఆధ్వర్యంలో టపాకాయలు కాల్చి, మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్,మైనారిటీ అధ్యక్షుడు షేక్ జావిద్, పార్టీ నాయకులు కట్టెల శ్రీనివాస్ గౌడ్, కుందారం శ్రీనివాస్, సంతోష్ గౌడ్, గోపు ఉషాన్న, వడ్ల రాజేశ్వర్, మెట్టు అశోక్, ఇమ్రాన్, విక్కీ, పురుషోత్తం, విద్యాసాగర్ వినేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు

వసతిగృహానికి ప్రహరీ

- విద్యార్థుల ఇక్కట్లపై నవతెలంగాణలో వరుస కథనాలు


నిర్మాణంలో ఉన్న ప్రహరీ



నవతెలంగాణలో వచ్చిన కథనం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల వసతి గృహం నందు ప్రహరి లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై నవతెలంగాణలో వచ్చిన వరుస కథనాలకు అధికారులు స్పందించారు ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించి గేటు ఏర్పాటు చేశారు. వసతిగృహానికి ప్రహరీ లేకపోవడంతో రాత్రి సమయంలో అడవి పందులు వస్తున్నాయని, పాములు వరండాలో సంచరిస్తుండటంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యేవారు. ఈ విషయమై నవతెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణం చేపట్టారు. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అటెండరే వైద్యుడు

- అందుబాటులో లేని పశువైద్యుడు
- వారంలో రెండు రోజులు వస్తానని డాక్టర్ వివరణ


పశువుకు వైద్యం చేస్తున్న అటెండర్


ఖాళీగా దర్శనమిస్తున్న పశువైద్యుడి చైర్

నవతెలంగాణ-మద్నూర్

రోగాల బారిన పడిన పశువులను పశువైద్యశాలకు తీసుకువస్తే ఆసుపత్రిలో విధుల్లో ఉన్న అటెండరే పశువులకు చికిత్సలు అందజేస్తున్నారు. మండలంలోని పశువైద్యశాలలో పశువులకు చికిత్సలు అందించవలసిన వైద్యులు విధులకు సక్రమంగా హాజరుకా వట్లేదని ఆరోపణలు వ్యక్తమవుతు న్నాయి. సోమవారం మండల కేంద్రంలో గల పశు వైద్యశాలను నవతెలంగాణ సందర్శించగా.. రోగాల బారిన పడిన పశువులకు అటెండరే చికిత్సలు నిర్వహి స్తూ కనిపించారు. అటెండర్‌ను వివరణ కోరగా.. డాక్టర్ లేని సమయంలో తానే చికిత్సలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 'మీకు ఏం తెలుస్తుంది' అని అడగగా తెలిసిన ఇంజక్షన్లు ఇస్తాను అంటూ సమాధానం ఇచ్చారు. అటెండర్ చికిత్సలను బట్టి చూస్తుంటే పశువులకు రోగం తగ్గినా తగ్గకపోయినా చనిపోయినా వాటి రోగాల గురించి అడిగేది ఎవరు అని ధీమాతోనే పశువైద్యులు విధుల్లో ఉండకపోవడం నిదర్శనంగా చెప్పవచ్చు.

ప్రస్తుతం వర్షాకాలం పశువులకైనా, జనాలకైనా అంటూ వ్యాధులు సోకే కాలం. ఇలాంటి సమయంలో పశువైద్యులు అందుబాటులో లేకపోవడం చికిత్సల కోసం తీసుకువచ్చే పశువులకు అటెండర్ తెలిసి తెలియని చికిత్సలు చేస్తుంటే పశువులు మరింతగా రోగాల బారిన పడితే బాధ్యులు ఎవరు రైతులు ప్రశ్నిస్తున్నారు. లక్షలాది రూపాయలు వైద్యులకు జీతాలు ఇస్తుంటే విధులకు డుమ్మాలు కొట్టడం ఏమిటనేది ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

డాక్టర్ గైర్హాజరు పట్ల నవతెలంగాణ మేనూర్ పశువైద్యులు సంతోష్‌కు ఫోన్ ద్వారా వివరణ కోరగా నా రెగ్యులర్ డ్యూటీ పిట్లం అని, మేనూరుకు ఇన్‌చార్జి అని ఇక్కడ వారంలో రెండు రోజులు వస్తాను అంటూ సమాధానం ఇచ్చారు. గత వారం నుంచి మీరు కనిపించడం లేదు కదా అని ప్రశ్నించగా నా డ్యూటీ బుధవారం, శుక్రవారం ఉంటుందని సమాధానం ఇచ్చారు. అధికారుల పనితీరు పట్ల ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉందని పశువులకు సక్రమంగా చికిత్సలు అందేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా రెగ్యులర్ వైద్యులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

'ఆదర్శ' ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్

నవతెలంగాణ-నిజాంసాగర్

ఆదర్శ పాఠశాల నిధులు గోల్ మాల్ చేసిన ప్రిన్సిపల్ చంద్రకళను వెంటనే సస్పెండ్ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నుండి విద్యార్థులతో ర్యాలీగా వచ్చి ఎంఈఓ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ప్రిన్సిపల్ పై వచ్చిన ఆరోపణలు ఒక ఎత్తు అయితే వాస్తవానికి పాఠశాలలో మౌలిక సదుపాయాలు అయినా మరుగుదొడ్లు, మంచినీటి వసతి, క్రీడ ప్రాంగణం, ల్యాబ్, తరగతి గదిలో ఫ్యాన్లు, లైటులు లేకపోవడం ఇలాంటి ఎన్నో సమస్యలను గుర్తించామని తెలిపారు. ఎన్నో బిల్లులు పెట్టి డబ్బులు తీసుకున్నట్టే గాని పాఠశాలలో ఏ ఒక్క వసతి కూడా కల్పించలేదని మండిపడ్డారు. వారానికి మూడు రోజులు మధ్యాహ్న భోజన పథకంలో గుడ్డును అందించాలని మెనూ లో ఉంటే ప్రిన్సిపల్ మాత్రం వారానికి ఒక గుడ్డు మాత్రమే అందించిందని విమర్శించారు. పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా ఆమె మాత్రం పట్టించుకోవడంలేదని అన్నారు. ఉన్నత విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల వైపు కన్నెత్తి చూడకపోవడం వలన ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని ఇప్పటికైనా ఉన్నత అధికారులు ప్రభుత్వ పాఠశాలల వైపు నిత్యం పర్యవేక్షించి ఇలాంటి ఘటనలు రాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం విద్యా వనరుల కేంద్రంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాజుకి వినతిపత్రం అందజేసి ప్రిన్సిపాల్ ని తక్షణమే సస్పెండ్ చేసి పాఠశాలలో మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని కోరారు. లేదంటే ఉద్యమాన్ని ఉద్రిక్తతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జుక్కల్ అధ్యక్షులు షేక్ ఫిర్దోస్, డివిజన్ కమిటీ సభ్యులు షేక్ ఫెరుకు, జమీల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు, విద్యార్థులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
2
మంగళవారం | జులై 09, 2024 | www.navatelangana.com

విద్యుత్ ప్రజావాణిని తనిఖీ చేసిన ఎస్ఈ


మాట్లాడుతున్న ఎస్ఈ రవీందర్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని ఎస్ఈ రవీందర్ సోమవారం తనిఖీ చేశారు. ఇప్పటివరకు జిల్లాలో 65 ఫిర్యాదులు రాగా.. 37 ఫిర్యాదులను పరిష్కరించామని చెప్పారు. మిగిలిన 28 ఫిర్యాదులు పెండింగ్లో ఉన్నాయన్నారు. ఎక్కువమంది ఎక్కువ బిల్లులు వస్తున్నాయని ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ శ్రీధర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేసిన రూరల్ ఎమ్మెల్యే


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలకేంద్రంలోని అరుంధతి ఫంక్షన్ హాల్ కళ్యాణ లక్ష్మి చెక్కులను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సోమవారం అందజేశారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లోని కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అంతకుముందు మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ కళాశాలను సందర్శించారు. కార్యక్రమంలో తాసిల్దార్ కిరణ్మయి, మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

ప్రజావాణికి 105 ఫిర్యాదులు


అధికారులకు ఫిర్యాదులు అందజేస్తున్న ప్రజలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 105 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరందు, డీపీఓ తరుణ్ కుమార్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టర్మినేట్ ఉత్తర్వును తాత్కాలికంగా నిలిపివేయాలి

కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లు 11మందిని టర్మినేట్ చేస్తూ డీఈఓ ఇచ్చిన ఉత్తర్వును తాత్కాలికంగా నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయు) ఆధ్వర్యంలో ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ కేజీబీవీల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న నాన్ టీచింగ్, వర్కర్లలో 61 సంవత్సరాలు నిండిన వారిని తొలగించాలని సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్-ఎస్ఏ) అధికారులు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఈ ఉత్తర్వులను నిలుపుదల చేయాలని, ఇతర కేంద్ర ప్రభుత్వ స్కీం వర్కర్ల లాగే, రిటైర్మెంట్ వయసు 65 సంవత్సరాలకు పెంచాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కు ఈవి నరసింహారెడ్డి, ఐఏఎస్‌కు శనివారం ఈనెల 06న యూనియన్ రాష్ట్ర కమిటీగా వినతిపత్రం ఇచ్చామన్నారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి, రెండు మూడు రోజుల్లో ఎస్ఎస్ఏ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కావున జిల్లాలో 61 సంవత్సరాలు నిండాయని 11 మంది కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లను టర్మినేట్ చేస్తూ డీఈవో ఇచ్చిన ఉత్తర్వులను తాత్కాలికంగా నిలుపుదల చేయాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసేటప్పుడు, రిటైర్ అయ్యే వారి కుటుంబ సభ్యులకే అవకాశం ఇవ్వాలని, నియామకాల్లో పూర్తి పారదర్శకతను పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. అదేవిధంగా కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది రమ, లక్ష్మి, రుక్మ, సాయమ్మ, సునీత, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

15 ధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సిర్ప హనుమాన్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర ప్రభుత్వా రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలను తక్షణమే విడుదల చేయాలని, నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పోరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో అనుమతించాలని, డిమాండ్ చేస్తూ ఈ ధర్నాను నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ డివిజన్ అధ్యక్షులు సిర్ప హనుమాన్లు తెలిపారు. 30శాతం ఫిట్మెంట్‌తో పేడివిజన్ కమిషన్‌ని విడుదల చేయాలని, ఇంకా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని కార్యవర్గం తీర్మానించిందని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుదం మధుసూదన్, జిల్లా నాయకులు ఈవీఎల్ నారాయణ, లావు వీరయ్య, బట్టి గంగాధర్, భోజరావు, బన్సీలాల్, రాజేందర్, రాధాకృష్ణ, ప్రసాదు, పురుషోత్తం బోధన్ డివిజన్ అధ్యక్షులు కృష్ణారావు, ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు బాబా గౌడ్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


పరిశీలిస్తున్న డాక్టర్‌సుప్రియ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ సుప్రియ పరిశీలించారు. సోమవారం మండల విద్యాధికారి ఆంధ్రయ్యతో కలిసి పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పరిశుభ్రమైన వాతావరణంలో ఆహార పదార్థాలను తయారు చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున ఈగలు ఎక్కువగా ఉంటాయని, వండిన ఆహార పదార్థాలపై తప్పనిసరిగా మూతలు పెట్టి ఉంచాలన్నారు. ఆహార పదార్థాలు కొనుగోలు చేసేటప్పుడు కూడా తాజా వాటిని కొనుగోలు చేయాలన్నారు. వర్షాకాలంలో పరిశుభ్రతను పాటించాలని, పిల్లలకు శుభ్రమైన ఆహారాన్ని అందించాలని తెలియజేశారు. చేతులు శుభ్రంగా కడుక్కున్న తర్వాతే భోజనాలు చేయాలని విద్యార్థులకు ఆమె సూచించారు. విద్యార్థుల కోసం వండి సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి చింత సత్యనారాయణ, పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు జీపీ పారిశుధ్య కార్మికుల సమ్మె

- బకాయి వేతనాలను విడుదల చేయాలి
- సిఐటియు డిమాండ్


వినతి పత్రం అంజేస్తున్న సిఐటియు నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులతో పాటు సిబ్బందికి రావాల్సిన బకాయి వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జంగం గంగాధర్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో శంకర్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంగం గంగాధర్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలను ప్రభుత్వం విడుదల చేయకపోవడం బాధాకర విషయం అన్నారు. గత నెల 26న, కలెక్టర్‌కు, జిల్లా పంచాయతీ అధికారికి వేరువేరుగా గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల బకాయి వేతనాలను మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు. అయినా అధికారులు స్పందించలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీ కార్మికులకు, సిబ్బందికి 29 వేల కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. కానీ నిజామాబాద్ జిల్లాకు ఏమాత్రం నిధులు మంజూరు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని ఇతర మండలాల్లోని గ్రామపంచాయతీ కార్మికులకు ఒకటి, రెండవ నెల బకాయి వేతనాలు మాత్రమే రావాల్సి ఉండగా, ఎడపల్లి మండలంలోని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు మాత్రం మూడు నెలల నుండి 8 నెలల వరకు బకాయి వేతనాలు రావాల్సి ఉందని ఆయన గుర్తు చేశారు. నెలల తరబడి కార్మికులకు జీతాలను ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నేగు ఎడపల్లి పాత బస్టాండ్ లోని ధర్నా చౌక్‌లో సమ్మె నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులతో పాటు సిబ్బంది సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమ్మె నోటిస్ ఇచ్చిన వారిలో జంగమ గంగాధర్, బూడిది రమేష్, అఫ్రోజ్ ఖాన్ తదితరులు ఉన్నారు.

కొత్త జీవో వచ్చేవరకు పోరాటం ఆపేది లేదు

- అంగన్‌వాడీ యూనియన్
- జిల్లా అధ్యక్షురాలు ఖైరిదేవగంగు


ధర్నాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కొత్త జీవో వచ్చే వరకు పోరాటం ఆపేది లేదని అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు ఖైరి దేవగంగు తెలిపారు. అంగన్వాడీ ఉద్యోగుల పోరాటంలో భాగంగా మూడో రోజు సోమవారం ధర్నా చౌక్ లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఖైరి దేవగంగు, గౌరవ అధ్యక్షులు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలకు పైగా పని చేసిన అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు, ఏప్రిల్ 31వ తేదీ లోపు 65 సంవత్సరాలు నిండిన వారికి రిటైర్మెంట్ ప్రకటిస్తూ జీవో నెంబర్ 10ని విడుదల చేశారన్నారు. దాని ప్రకారం టీచర్‌కు లక్ష రూపాయలు, ఆయాకు 50వేలు చెల్లిస్తూ జూలై 1 నుండి విధులకు ఎవరు హాజరు కాకూడదని ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇది పూర్తిగా అంగన్వాడీ ఉద్యోగులను వంచించటమే అవుతుందని సెప్టెంబర్ నెలలో జరిగిన 24 రోజుల సమ్మె సందర్భంగా అప్పటి ప్రభుత్వం అధికారుల సమక్షంలో అంగన్వాడీ టీచర్లకు రెండు లక్షలు, ఆయాలకు లక్ష రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లిస్తామని, అదేవిధంగా పెన్షన్ సదుపాయాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పాత జీవోను అమలు జరపాలని ఆదేశించడం అంటే అంగన్వాడీ ఉద్యోగుల పోరాటాన్ని నీరుగార్చటమే అవుతుందని అన్నారు. అదేవిధంగా పోరాటం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు అంగన్వాడీ ధర్నా శిబిరాల వద్దకు వచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్వాడీ ఉద్యోగులకు 18 వేల వేతనం చెల్లిస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీనిచ్చారు. గెలిచిన తర్వాత ఉద్యోగులకు ఇచ్చిన హామీని మరిచిపోవటం సరైంది కాదని వారు అన్నారు. ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 10ని వెనక్కి తీసుకోవాలని, అంగన్వాడీ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని, రిటైర్మెంట్ ప్రకటించిన అంగన్వాడీ ఆయాలు, టీచర్లు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు. జ్యోతి, గంగుబాయి, చిలుబై, తదితరులతోపాటు ఆయా మండలాల రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రూ.4వేలు జీవనభృతి అమలు చేయాలి

- ఐఎఫ్‌టీయూ
- బీడీ కార్మికుల భారీ ప్రదర్శన, సభ


ర్యాలీగా వెళ్తున్న నాయకుల, బీడీ కార్మికులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన దాని ప్రకారం కార్మికులందరికీ 4వేల రూపాయల జీవన భృతి వెంటనే అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు కృష్ణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. సోమవారం సూర్య శివాజీ అధ్యక్షతన నిజామాబాద్ నగరంలో సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న కృష్ణ మాట్లాడుతూ బీడీ పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదనీ, కార్మికులకు ఉపాధి కల్పించండి లేదా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీవనభృతి ఇచ్చి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గత సర్కార్ కెసిఆర్ మనకు అనేక ఆంక్షలు విధించి, కార్మికులకు తీవ్ర ఇబ్బంది కలిగించిందని ఆయన తెలిపారు. బీడీ పరిశ్రమను దెబ్బతీయానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం రకరకాల చర్యలు చేపట్టి, సిగిరేటు కంపెనీలకు ఊడిగం చేస్తుందని ఆయన అన్నారు. మోడీ ఎన్నికల్లో ఉపాధి భద్రత, స్వదేశీ పరిశ్రమల పరిరక్షణ, ప్రతి ఏటా రెండు కోట్ల కొలువులు ఇస్తామని వాగ్దానాలు చేసి, కార్మిక వ్యతిరేక విధానాలతో కార్పొరేట్ కంపెనీలకు సేవ చేసిందని ఆయన తెలిపారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను మోడీ ప్రభుత్వం తీసుకొచ్చి కార్మిక హక్కులను కాల రాస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి తెలంగాణ అసెంబ్లీలో నాలుగు లేబర్ కోడలను అమలు చేయడం సాధ్యం కాదని తీర్మానం చేయాలని ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ చట్టాలను కార్మికులకు వర్తింప చేయాలని ఆయన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్మికుల మధ్య మత వివాదాన్ని సృష్టిస్తోందని ఆయన తెలిపారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య పాల్గొని మాట్లాడుతూ ఉపాధి అయిన కాపాడండి లేదా తిండి అయినా పెట్టండని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ మౌలిక సమస్యల పరిష్కారం కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బీడి పరిశ్రమలో ప్రధానంగా ఉన్న మహిళల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడం కోసం ప్రత్యేకంగా కృషి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నిజామాబాద్ నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుండి భారీ ప్రదర్శనగా ధర్నాచౌక్ చేరుకొని బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో భీడి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ భూమేశ్వర్, గౌరవాధ్యక్షులు భూమన్న, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి జేపీ గంగాధర్, పాల్గొని ప్రసంగించారు. యూనియన్ జిల్లా నాయకులు శివకుమార్, పద్మ, సుప్రియ, పోశెట్టి, బాలయ్య, పాల్గొన్నారు. అరుణోదయ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సూరీబాబు, అబ్దుల్, కళాకారులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- తాగునీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విస్తరణ అధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వర్షాకాలంలో తాగునీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, దోమలు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోనే విధంగా గ్రామ పంచాయతీ కార్యదర్శికి తెలియజేయాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ అన్నారు. సోమవారం ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆశా కార్యకర్తల నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ పాల్గొని మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. దోమలు పెరిగినట్లయితే దోమల వల్ల కలిగే వ్యాధులైన మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, ఫైలేరియా లాంటి వ్యాధులు సోకే అవకాశం ఉంటుందని వివరించారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని, పూల తొట్టిలు, పడేసిన కొబ్బరి బొండాలు, వాడి పక్కకు ఉంచిన కూలర్లు వాటిలో నీరు నిల్వ ఉన్నట్లయితే నీటిని తొలగించాలని తెలిపారు. తల్లిపాల ఆవశ్యకత గురించి వివరించి పలు సూచనలు సలహాలు చేశారు. ప్రసవం జరిగిన గంటలోపు వచ్చే ముర్రుపాలను కచ్చితంగా శిశువుకు తాగించాలని, ఆ ముర్రుపాలలో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుందని, అది జీవితాంతం ఒక టీకా లాగా పనిచేస్తుందని, తల్లిపాలు తాగిన వారు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. వచ్చేనెల నుంచి ప్రారంభే వయోవృద్ధుల బిసి టీకా కార్యక్రమం సందర్భంగా ఇంటింటా 18ఏళ్ళ పైబడిన వారందరి సర్వే చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో హైపర్ టెన్షన్, డయాబెటిక్ వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి నెలకు సరిపడా మందులు అందజేయాలని తెలిపారు. జాతీయ క్షయవ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా రెండు వారాలకు మించి దగ్గు జ్వరం కలిగిన ప్రతి ఒక్కరి నుండి తెమడ పరీక్ష నిమిత్తం తీసుకొని రావాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో గల పాఠశాలను హాస్టల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. దానికి సంబంధించిన ప్రణాళికను తయారు చేసి ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, ఆరోగ్య కార్యకర్తలు వెంకటరెడ్డి, ఆనంద్, ఉదయ, ఇందిర, స్వర్ణలత, భానుప్రియ, రాధిక, శారద, సుజాత, అరుంధతి, సాయి వీర కుమారి, అనంత శీబారాణి ,సావిత్రి, శైలజ, భానుప్రియ, పాల్గొన్నారు.

టీయూలో తీజ్ పండుగ నిర్వహణపై సమావేశం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో తీజ్ పండుగ నిర్వహణపై గిరిజన శక్తి విద్యార్థి సంఘం వర్సిటీ అధ్యక్షుడు శ్రీను రాథోడ్ అధ్యక్షతన సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమయంలో బంజారాల సంస్కృతిని కాపాడాలనే ముఖ్య ఉద్దేశంతో తెలంగాణ యూనివర్సిటీలో తీజ్ పండుగను ఘనంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పలు అంశాల పై చర్చించారు. విద్యార్థులంతా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంజయ్, సాగర్ నాయక్, చందర్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల 10 జీపీఎ సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్, తహసీల్దార్ కిరణ్మయి, ప్రిన్సిపాల్ రాజేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సదరం క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ముప్కాల్

ఈ నెల 10,24,31వ తేదీల్లో సదరం క్యాంపులు నిర్వహించనున్నారని ఎంపీడీవో మహమ్మద్ ముజాఫరోద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం 10గంటలకు క్యాంపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మీ సేవ కేంద్రాలలో బుక్ చేసుకున్న స్లాట్ తేదీ ప్రకారం దివ్యంగులు క్యాంపునకు హాజరుకావాలని తెలిపారు. సదరం క్యాంపు కార్యాలయంకు వెళ్లే వారు మెడికల్ రిపోర్టులను వెంట తీసుకోనిపోవాలని సూచించారు.

ముప్కాల్ వాసికి అరుదైన గౌరవం

- సన్మానం పొందుతున్న కోమటిరెడ్డి గంగాధర్‌రెడ్డి



కోమటిరెడ్డి గంగాధర్‌రెడ్డిని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర కబడ్డి అసోసియేషన్ ప్రెసిడెంట్ కాసాని జ్ఞానేశ్వర్, సెక్రటరీ జగదీశ్వర్ యాదవ్ సమక్షంలో తెలంగాణ రాష్ట్ర కబడ్డి అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం రాత్రి మేడ్చెల్ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామా బాద్ జిల్లా నుంచి జిల్లా కబడ్డి అసోసియేషన్ అధ్యక్షులు అంద్యాల లింగయ్య, సెక్రటరీ కోమటిరెడ్డి గంగాధర్ రెడ్డిని సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర కబడ్డి అసోసియేషన్ ప్రెసిడెంట్ చేతులమీదుగా నిజామాబాద్ జిల్లా వాసులు సన్మానం పొందడం పట్ల పలువురు ప్రముఖులు, మండల కేంద్రానికి చెందిన గ్రామాభివద్ధి కమిటీ అధ్యక్షుడు లింగం, సెక్రటరీ గడ్డం చిన్న గంగారెడ్డి, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ అంజయ్య, జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారులు టి.సాయన్న, రాజ్ కుమార్, గద్దల గంగారాం, సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్

రైతాంగానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు నూతల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం ఆర్మూర్, ఆలూరు, నందిపేట్ మండలాల కిసాన్ మోర్చా మండల అధ్యక్షులతో కలిసి తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఏకకాలంలో 2 లక్షలు అసలు వడ్డీతో సహా రుణమాఫీ చేయాలన్నారు. రైతులకు రైతుబంధు ఖాతాల్లో వెయ్యాలని, 14 పంటలకు బోనస్ ఇవ్వాలని, రైతు కూలీలకు 12 వేల రూపాయలు వెంటనే ఇవ్వాలని, రైతాంగానికి ఇచ్చి హామీలు వెంటనే నెరవేర్చాలని భారతీయ జనతా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేశారు. లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేంతవరకు ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండలాల అధ్యక్షులు, నాయకులు యామాద్రి భాస్కర్, ఆకుల శ్రీను, కలిగోట గంగాధర్ రైతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే

- నాటిన మొక్కలు సంరక్షించాలని సూచన

నవతెలంగాణ-కామారెడ్డి

వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌లో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సోమవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి కాలుష్యాన్ని తగ్గించవలసిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని అందుకోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి అన్నారు.



మొక్కనాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే

గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- ఈ నెల 12 చివరి తేదీ : అచ్చంపేట్ గురుకుల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని అచ్చంపేట్ గ్రామంలో ఉన్నటువంటి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు కోసం https://tgswadtr.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 12వ తేదీ చివరి అని ఆయన తెలిపారు. ఇట్టి అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

- కలెక్టరేట్‌లో ప్రజావాణి వినతులపట్ల జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశం
- మండలాల్లో ప్రజావాణికి సైతం పలు చోట్ల ఫిర్యాదులు

నవతెలంగాణ-కామారెడ్డి/పిట్లం/పెద్దకొడప్‌గల్/నిజాంసాగర్



కామారెడ్డిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు



పిట్లంలో ప్రజావాణికి హాజరైన వివిధ శాఖల అధికారులు..



నిజాంసాగర్ తహసీల్ కార్యాలయంలో..

ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. వివిధ మండలాలల నుంచి వచ్చిన ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల ద్వారా స్వీకరించారు. ప్రధానంగా విద్య, వైద్య, బిసి, గిరిజన సంక్షేమం, విద్యుత్, పంచాయతీ, పింఛన్లు, ఆపద్బాంధు, మున్సిపాలిటీ, ధరణి, మైన్స్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు తదితర అంశాలకు సంబంధించి 114 ఫిర్యాదులు అందాయి. అట్టి ఫిర్యాదులను ఆయా శాఖాధికారులకు అందజేస్తూ ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణి తో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ క్షుణ్ణంగా పరిశించి పరిష్కరింపదగినవి వెంటనే పరిశీలించాలని, లేని వాటికి తగు ప్రత్యామ్నాయ మార్గం ఫిర్యాదీదారునికి తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డిఆర్డిఓ చందర్, డిపిఓ శ్రీనివాసరావు, సిపిఓ రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిట్లంలో ఒక ఫిర్యాదు

పిట్లం : మండల తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వ్యర్థాల తొలగించాలని ఒక ఫిర్యాదు వచ్చినట్లు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో వైన్స్ షాప్ వారు జనసంచారం ప్లేస్ లో వ్యర్థాలను పారవేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, అట్టి వ్యర్థాలను తొలగించాలని ఫిర్యాదు వచ్చినట్టు తెలిపారు. కాగా ఫిర్యాదును పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కమలాకర్‌కు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దేవి సింగ్ , మండల వ్యవసాయ అధికారి కిషన్ , ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ ప్రవళిక , ఐసిడిఎస్ సూపర్వైజర్ రేణుక , ఐకెపి ఏపిఎం శిరీష , గిరిజన , వెనుకబడిన వసతి గృహాల వార్డెన్లు శాంతి , గంగ వీణ ఎంపీ హెచ్ ఈవో భూమయ్య పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో 11 దరఖాస్తులు

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రోజు జరిగిన ప్రజావాణిలో 11 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. పట్టా భూముల్ని పార్ట్ బి నుంచి తొలగించాలని మండల కేంద్రంలోని బేగంపూర్ గ్రామానికి చెందిన రైతులు ప్రజావాణిలో ఎమ్మార్వో దశరథ్ ను వినతి పత్రం అందజేశారు. బేగంపూర్ గ్రామ శివారులోని 104 సర్వే నంబర్లో గల భూమి గత 70 సంవత్సరాల నుంచి పట్టా భూమిగా కొనుగోలు చేశామని తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన పాస్ బుక్ ఉన్నాయని రైతుబంధు కూడా తీసుకున్నామని తెలిపారు. రెవిన్యూ ఫారెస్ట్ రికార్డులలో అడవి భూమి అని ఎక్కడా రికార్డులో లేదని తెలిపారు. ఈ భూమి ఎలా పార్ట్ బి లో ఉంచుతారని రైతులు ఎమ్మార్వో దశరత్ ను రాతపూర్వకంగా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను తీర్చి న్యాయం చేయాలని కోరారు. కాగా మొత్తం 11 దరఖాస్తులు వచ్చాయని ఎమ్మార్వో దశరథ్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

నిజాంసాగర్ : కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజావాణికి అందిన ఫిర్యాదులను వెంటనే మండల కేంద్రంలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ భిక్షపతి తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన సమస్యలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అప్పుడే ఉన్నతాధికారులు అందిస్తారని వాటిని ప్రతి సోమవారం తాహసిల్దార్ కార్యాలయంలో శాఖ వారిగా అధికారులందరూ కూడా సేకరించి వాటిని తక్షణమే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, ఎంపీ ఓ యాదగిరి, మండల వ్యవసాయ శాఖ అధికారి అమర్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీవో సూర్యకాంత్, ఏఈఓ రూప, అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-సదాశివనగర్



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సైబర్ నేరాల కట్టడిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, ఆకతాయిలు వేధిస్తే వెంటనే షీటీమ్‌కు సమాచారం అందించాలని కళాబృందం సభ్యులు, పోలీసులు సూచించారు. సైబర్ నేరాలు, షీటీంలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం తుక్కాజివాడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులు సెల్ ఫోన్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్‌లను విడుదల చేయాలని భారతీయ విద్యార్థి మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మోర్చ జిల్లా అధ్యక్షులు ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షులు అర్బస్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.5000 కోట్లపైగా రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ పెండింగ్‌లో ఉండటం వలన విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. బకాయిలు రాకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని అన్నారు. పలు ప్రయివేటు విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికేట్‌లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కళ్యాణ్, కార్తీక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



పనులు పరిశీలిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాల, కేజీబీవీ పాఠశాలలను సోమవారం డీఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించినట్లు తెలిపారు. త్వరితగతిన నాణ్యతతో పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఆయన వెంట ఏపిఎం జగదీష్, ప్రిన్సిపల్ శ్రీలత వీణా ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి

నవతెలంగాణ-సదాశివనగర్



మొక్కలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

మండలం లోని ఉత్తునూర్ గ్రామంలో సోమవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి ఆరు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి దేవి సింగ్, ఫీల్డ్ అసిస్టెంట్ మొగుళ్ళ బాల్ నర్సా గౌడ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు నాటిన మొక్కలను సంరక్షించి పచ్చదనాన్ని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

నవతెలంగాణ-గాంధారి



మృత్యువాతపడిన ఆవు

గాంధారి మండలంలోని బిర్మల్ తండాకు చెందిన బస్సీ నార్చేడ్‌కు చెందిన ఆవు.. బోరు బావి వద్ద విద్యుత్ షాక్ తగలడంతో సోమవారం మృత్యువాత పడినట్టు వాపోయాడు. ఆవు గర్భవతిగా ఉందని ఆవు మృతితో సుమారు 30000 రూపాయలు నష్టం వాటిల్లిందని అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతు కోరారు.

11న ఆలయ భూముల వేలం పాట

నవతెలంగాణ-మద్నూర్

ఈనెల 11న గురువారం ఉదయం 11 గంటలకు మద్నూర్ మండలంలోని మేనూర్ శ్రీ హనుమాన్ దేవస్థానం భూములు కౌలు వేలంపాట నిర్వహించనున్నట్టు దేవాదాయ ధర్మాదాయశాఖ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ అలాగే సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దేవస్థానానికి చెందిన రెండు సర్వే నెంబర్లు కలిసి మొత్తం 14 ఎకరాల 16 గుంటలు భూమి ఉన్నట్లు ఈ భూమికి కౌలు వేలంపాట నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు ముందుగా మూడు వేల రూపాయలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, గతంలో దేదస్థానానికి ఎలాంటి బకాయిలూ ఉండకూడదని పేర్కొన్నారు. ఈ భూములు కౌలు పొందిన వారు 11-7-2024 నుండి10-7-2025 వరకు సాగు చేసుకోవచ్చని ఆ ప్రకటనలో సూచించారు.

హెూం సీడ్ ప్లాంట్ పంపిణీ

నవతెలంగాణ-జుక్కల్



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

మండల కేంద్రం లోని నర్సరిలో ఉపాధి లో పెంపకం చేపట్టిన నర్సరీలోని మొక్కలను ఎంపిడివో శ్రీనివాస్ స్థానిక సిబ్బందితో కలిసి సోమవారం సందర్శించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెంచిన మొక్కలను గ్రామాలలో ఇంటింటికి పంపిణీ చేసెందుకు సిద్ధంచేసి తరలించారు. ప్రతి ఒక్కరూ ఆరు మొక్కలను పెంచాలని మండల ప్రజలకు సూచించారు. గ్రామాలలో అవగాహన కల్పించాలని జీపి కార్యదర్శులకు ఇటివలే ఆదేశాలు జారీ చేసినట్టు ఎంపిడివో శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెంట స్థానిక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సప్త భజన

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరాలంలో వర్షాలు సమృద్ధిగా కురువాలని కోరుతూ సప్త భజన కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. శివునికి జలాబిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజయ్య, మాజీ అద్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి, సనాతన భజన మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు జీవనభృతి అమలు చేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు

వ్యవసాయ కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో జీవన భృతిని అమలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం వ్యవసయ కూలీలకు రూ.12000 జీవనభృతిని తక్షణమే ఇవ్వాలని తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు వ్యవసాయ కూలీలతో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపి కెఎంఎస్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ కూలీలను పట్టించుకోక పోవడం వల్ల తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. "రెక్కడితే డొక్కాడని" వ్యవసాయ కూలీలను అన్ని పార్టీలు ఓట్ల కోసం మాత్రమే వాడుకుంటున్నారని, వీరి సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని తీవ్రంగా విమర్శించారు. వ్యవసాయ కూలీలు ఎలాంటి సంక్షేమ పథకా లకు నోచుకోవడం లేదన్నారు. వీరిని కార్మికు లుగా గుర్తిస్తే పీఎఫ్, ఈఎస్ఐ లాంటి వసతులు అమలు కావడం లేదన్నారు. వీరికి ప్రమాదాలు జరిగితే, ప్రాణాలు పోతే నష్టపరిహారం అందే అవకాశం లేదన్నారు. అందుకే వ్యవసాయ కూలీలకు ఇన్సూరెన్స్, పిఎఫ్, లాంటివి కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద ఉందన్నారు. బీహార్, చత్తీస్ ఘడ్, పశ్చిమ బెంగాల్ లాంటి చోట్ల నుంచి కూలీలు వలస వచ్చి ఇక్కడ వరినాట్లులాంటి పనులు చేస్తుండటంతో వ్యవసాయ కూలీలకు ఉపాధి మొత్తం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం కృషి చేయాలని, లేకుంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు జి.సురేష్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) డివిజన్ నాయకులు ఆర్.దామోదర్, ఏఐపీకేఎస్ జిల్లా అధ్యక్షులు జి.పరమేష్, నాయకులు ఎస్.కిషోర్, ఏఐపి కెఎంఎస్ జిల్లా అధ్యక్షులు బి.కిషోర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌కు నివాళి

- జయంతి వేడుకలు నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు

నవతెలంగాణ-విలేకరులబృందం



ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో..



కామారెడ్డిలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఆయనకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నివాళి అర్పించాయి. ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు.

దోమకొండ : మండల కేంద్రం లోని గాంధీ చౌరస్తా వద్ద మాజీ సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహనికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంత రెడ్డి, మాజీ జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, నాయకుల ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఆయన చేసిన అభివృద్ధి, సేవలను మరువలేనివని, నిరుపేదల కోసం 108 అంబులెన్స్, రైతు రుణమాఫీ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇల్లు పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సీతారాం మధు, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్ జిల్లా కార్యదర్శి అబ్రబోయిన స్వామి, నాయకులు నర్సయ్య,ఆర్ నర్సారెడ్డి,ఎంపీటీసీ నిమ్మ శంకర్ కోఆప్షన్ మెంబర్ శమీ, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్ రెడ్డి నివాసం వద్ద సోమవారం వైయస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆఫీస్ పటేల్, నాగం పరంధాములు, చిరంజీవిలు, యునూస్, లింబ్యా నాయక్, కాశీరాం, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జయంతి వేడుకల్లో పార్టీ నాయకులు మాట్లాడుతూ.. వైయస్సార్ అంటే సంక్షేమమని , ఉచిత విద్యుత్ ఫైల్ పై తొలి సంతకం చేసిన ఘనత వైఎస్ఆర్ కి దక్కిందని ఈ సందర్భంగా తెలిపారు. అలాగే ఆరోగ్యశ్రీ, 108 ఉచిత అంబులెన్స్ , జల యజ్ఞం , ఫీజు రియంబర్స్ మెంట్, ఆసరా పెన్షన్లు వంటి ఎన్నో ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించిన ఘనత ఆయనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెన్న లక్ష్మణ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సంతోష్, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షులు నాగం శ్రీనివాస్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజార్, సాయిబాబా గౌడ్, వహీద్, సుధాకర్, సాయిలు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకొని కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో గల డాక్టర్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల లేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన విద్యారంగంలో వైద్యరంగంలో, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పండ్ల రాజు, కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుడుగల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కారంపూడి అశోక్ రెడ్డి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నిమ్మ మోహన్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు రామ్మోహన్, కన్నయ్య, అంజద్, పంపరి శ్రీనివాస్, చాట్ల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తికి 5 నెలల జైలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

దొంగతనానికి ప్రయత్నించి పట్టుబడిన వ్యక్తికి న్యాయస్థానం జైలు శిక్ష విధించినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఫిబ్రవరి 15న రాంపూర్ గ్రామానికి చెందిన ధ్యావల మీనా ఇంటిలో దొంగతనానికి ప్రయత్నించిన టువంటి అదే గ్రామానికి చెందిన గుడ్డండ్ల ప్రవీణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. అనంతరం సోమవారం విచారణ చేపట్టిన ఎల్లారెడ్డి మున్సిపల్ కోర్టు మెజిస్ట్రేట్ హారిక నిందితునికి 5 నెలల కారాగార శిక్ష విధించారని ,శిక్ష ఖరారు అయిన వెంటనే నిందితుడిని నిజామాబాద్ జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు. నిందితుడు ప్రవీణ్ పై గతంలో కూడా పలు దొంగతనం కేసులు ఉన్నాయని కోర్టు కానిస్టేబుల్ నరేందర్, ఎస్ఐ మహేష్ తెలిపారు.

తండ్రి హత్య కేసులో కొడుకుకు జీవిత ఖైదు

నవతెలంగాణ-కామారెడ్డి

ఆస్తిపంపకాలు చేపట్టడం లేదని ఆగ్రహంతో తండ్రిని హత్య చేసిన కొడుకుకు జీవిత ఖైతు, రూ.10 వేల జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు న్యాయ మూర్తి వరప్రసాద్ సోమవారం తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ సింధూశర్మ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. 2019 మే 7వ తేదీనా బీబీపేట్ గ్రామానికి చెందిన బోయిని నరసయ్య(60)ను కొట్టి చంపారని కోడలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా మృతుని పెద్దకుమారుడు బోయిని రాజయ్య(45)... ఆస్తి పంపకాలు చేపట్టడం లేదని తన తండ్రిని హత్య చేసినట్టు నిరూపితమైనట్టు తెలిపారు. విచారణ చేసిన సీఐలు యాల్యాద్రి, రాజశేఖర్, పోలీసు తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్ గౌడ్ , కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత సి ఐ, యస్. సంపత్ కుమార్, యస్ ఐ, యం ప్రభాకర్ కోర్టు కానిస్టేబుల్ నరేష్ గౌడ్, అనిల్ కుమార్ లను జిల్లా ఎస్పీ అభినందించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు ముగ్గురు అర్హత


నవతెలంగాణ-పిట్లం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన గ్రూప్ - 1 ప్రిలిమ్స్ పరీక్ష ఫలితాలు విడుదల కాగా.. మండల నుంచి ముగ్గురు అభ్యర్థులు మెయిన్స్‌కు క్వాలిఫై అయినట్టు పలువురు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్ - 1 ప్రిలిమ్స్‌కు 31, 382 మంది విద్యార్థులు అర్హత సాధించగా అందులో మండలం లోని తిమ్మా నగర్ గ్రామానికి చెందిన జోషి కిషోర్, అనిల్‌గౌడ్, కంబాపూర్ గ్రామానికి చెందిన గైని భీమ్‌రావ్ అర్హత సాధించారు. కిషోర్ పంతులు ప్రస్తుతము హాస్టల్ వెల్ఫేర్ అధికారిగా విధులు నిర్వర్తిస్తుండగా, అనిల్‌గౌడ్ హైదరాబాద్ పట్టణములో కమర్షియల్ ట్యాక్స్‌లో ఏసిటిఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గైని భీం రావ్ మండలంలోని మార్ దండా గ్రామ పంచాయితీ సెక్రెటరీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీరు గ్రూప్- 1 మెయిన్స్ అర్హత సాధించడంతో మండల, ఆయా గ్రామాల ప్రజలు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

కుళాయిల పరిస్థితి అధ్వానం

- పట్టించుకోని గ్రామ కార్యదర్శి, ప్రత్యేక అధికారి

నవతెలంగాణ-మద్నూర్



పైపు విరగడంతో వృథాగా పోతున్న నీరు

మండలంలోని లచ్చన్ గ్రామంలో కుళాయిల పరిస్థితి అధ్వానంగా కొనసాగుతుంది. ప్రజల కోసం వదిలే నీరు తూట్లిలు బిగించకపోవడం వదిలే నీరు వృథాగా పోతున్నాయి. గ్రామ ప్రజలకు నీటి సరఫరా విషయంలో ఆ గ్రామ కార్యదర్శికి, గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వృథాగా పోతున్న నీటి దృశ్యాలను చూస్తుంటే అధికారుల పనితీరు ఏ విధంగా కొనసాగుతుందో కండ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. అధికారుల పాలన గ్రామ పంచాయతీల్లో పట్టింపు లేని విధంగా కొనసాగుతున్నట్లు లచ్చన్ గ్రామ దృశ్యాలే నిదర్శనంగా కనిపిస్తున్నాయి. ఈ గ్రామంలో నీటి సరఫరా విషయంలో అధికారుల నిర్లక్ష్యం పట్ల సంబంధిత ఉన్నత అధికారులు ఆ గ్రామాన్ని సందర్శించి ప్రజలు ఎదుర్కొనే అవస్థలు గురించి, నీరు వృథా అయ్యే వాటి గురించి గానీ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతి

నవతెలంగాణ-రామారెడ్డి



మృతిచెందిన అనిల్

బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఒకరు మృతిచెందిన ఘటన పోసానిపేట జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఆంధ్రలోని ప్రకాశం జిల్లా, సి ఎస్ పురం మండలం, శివంవారి పల్లె గ్రామానికి చెందిన గంజరాపల్లి అనిల్ (45) ఆదివారం రాత్రి ఉప్పల్వాయి గ్రామం నుండి పోసానిపేట వస్తుండగా ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి రోడ్డు కిందకు వెళ్లింది. దీంతో అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు అంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విజయ్ కొండ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
మంగళవారం | జులై 09, 2024 | www.navatelangana.com

విద్యుత్ ప్రజావాణికి ఫిర్యాదు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి డివిజన్ కార్యాలయంలో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం సిరికొండ మండలంలోని కొండూర్ గ్రామంలో రైతులు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఎక్కువ మోటార్లు ఉండటం వల్ల తరుచూ ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు తలెత్తుతున్నాయని డిచ్‌పల్లి డివిజనల్ ఇంజనీర్ ఉత్తమ్ జాడేకు విన్నవించారు. క్షేత్రస్థాయి అధికారులను పంపించి పరిశీలన చేసి తగు చర్యలు తీసుకుంటామని వినియోగదారులకు తెలిపారు.



వినతిపత్రం అంజేస్తున్న రైతులు

నిబంధనల ప్రకారం డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ని బదిలీ చేయాలి

- టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వెనిగళ్ళ సురేష్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు మేరకు అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న డైట్ ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వెనిగళ్ళ సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక స్థానంలో ఐదు సంవత్సరాలు అనంతరం బదిలీ చేయాల్సి ఉన్న 15 సంవత్సరాలుపైగా ఒకే దగ్గర పని చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను బదిలీ చేసి నిబంధనలు పాటించాలని సూచించారు. ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకంగా పదోన్నతి పొంది, అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు.

ఎన్ఎస్ఎఫ్ రక్షణ కమిటీ కన్వీనర్ రాఘవులుకు ఘన నివాళి


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

నిజాం షుగర్ ఫ్యాక్టరీ రక్షణ కమిటీ కన్వీనర్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఉప్పునూతల రాఘవులు వర్ధంతిని పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెండు నిముషాలు మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాఘవులు సార్ ఆశయ సాధనకు ప్రతి ఒకరూ ముందుకు సాగుదామన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నడపాలని, అక్రమ లే ఆఫ్ ఎత్తివేయాలని, సుమారు నాలుగు సంవత్సరాలు బోధన్ కేంద్రంగా అలుపెరుగని పోరాటం నడిపిన వ్యక్తి రాఘవులు సార్ అని కొనియాడారు. బోధన్ ప్రాంత రైతాంగం గురించి, కార్మికుల గురించి నిరంతరం తపన పడే వాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జేఏసీ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, వామపక్ష పార్టీల నాయకులు పి.వరదయ్య, మల్లేష్, గంగాధరప్ప, శంకర్‌గౌడ్, ఏశాల గంగాధర్, సురేష్, కంజర భూమయ్య, సుధాకర్, వెంకటేశ్వర్లు, కార్మిక నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలించిన ఎంపీడీవో


మధ్యాహ్న భోజనంను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాల, ప్రైమరీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో హెచ్ శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతతో కూడిన ఉండాలని ఆయన మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారికి ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా స్వచ్ఛమైన నీటిని అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందునా, ఉపాధ్యాయులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రత్యేకతనిగా పెట్టాలన్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలు విద్యార్థులకు వండి పెట్టే అన్నం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, ఉపాధ్యాయులు కిషోర్, వి గంగాధర్, కృష్ణమూర్తి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ పట్ల విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-కోటగిరి

సీజనల్ వ్యాధులు, జాతీయ కిటక జనిత వ్యాధులపై మండలంలోని ఎత్తొండ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం సోమవారం ఏర్పాటు చేశారు ఇంటి పరిసరాల్లో నీరు నిలువకుండా, దోమల వృద్ధి లేకుండా ఉండే విదంగా తల్లి దండ్రులకు చెప్పాలని అన్నారు. దీనిపై ఇరుగు పొరుగు వారితో చర్చించాలని తెలిపారు. దోమలు కుట్టకుండా పూర్తిగా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వారానికి ఒక సారి గోళ్ల కత్తిరించాలని, చిరు తిండన్లు తినకూడదని ఆరోగ్య విస్తీర్ణ అధికారి గోవర్ధన్ వివరించారు. కార్యక్రమంలో నందు ఆరోగ్య సిబ్బంది హిమాంజలి, సరోజ, ఆశాలు స్రవంతి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-మాక్లూర్


మృతి చెందిన సాయినాథ్

మండలంలోని మానిక్ బండారు గ్రామ చెరువులో ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మోపాల్ మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన సాయినాథ్(31) మూడు సంవత్సరాలుగా మాణిక్ బండార్ గ్రామంలో ఓ వ్యక్తి దగ్గర పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. రోజు లాగే పశువులను తీసుకొని మేతకు వెళ్ళాడని తెలిపారు. పశువులు మాణిక్ బండార్ గ్రామ శివారులోని చెరువులోకి వెళ్ళగా అది గమనించిన సాయినాథ్ వాటిని ఒడ్డుతెచ్చే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికులతో చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం మృతదెహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాక్లూర్ ఎస్ఐ సుదీర్ రావు తెలిపారు.

వైఎస్ సేవలు మరువలేనివి

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ భవన్ లో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తాహెర్బిన్ హందాన్ మాట్లాడుతూ.. రాజశేఖర్ రెడ్డి సేవలు ఎన్నటికీ మరువలేనివని, ఎల్లప్పుడూ పేద, మధ్యతరగతి ప్రజల అభివృద్ధి గురించి ఆలోచించిన వ్యక్తి వైయస్సార్ అని, వైయస్సార్ లేని లోటు ఎవరు తీర్చలేనిదని ఆయన అన్నారు. మరీ ముఖ్యంగా నిజామాబాద్ జిల్లాకు రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని అన్నారు. జిల్లాలో విద్యార్థుల కోసం తెలంగాణ యూనివర్సిటీ ఆయన హయాంలోని నిర్మించారన్నారు. మెడికల్ కళాశాల ఆయన ఆయంలోనే వచ్చిందని, రైతాంగంకోసం గుత్ప, అలీ సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ఆయన హయాంలోనే వచ్చాయన్నారు. ఉమ్మడి ఆధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా పార్టీకి దశ, దిశ చూపిన వ్యక్తి అని, ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరిగే విధంగా అభివృద్ధి పనులు చేసిన వ్యక్తి అని తాహెర్బిన్ హాందాన్ అన్నారు. ప్రతి ఒక్కరూ రాజశేఖర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు వేణురాజ్, రాష్ట్ర ఎన్ఎస్యూఐ ప్రధాన కార్యదర్శి విపుల గౌడ్, సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, బీసీ సెల్ అధ్యక్షులు నరేందర్, మహిళా కాంగ్రెస్ నాయకులు చంద్రకళ,స్వామి గౌడ్,సాయిలు, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.


కంఠేశ్వర్: నివాళులర్పిస్తున్న నాయకులు


బోధన్‌లో...

కోటగిరి: మండల కేంద్రంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను జిల్లా మైనార్టీ కార్యదర్శి వహీద్ హుస్సేన్ ఆధ్వర్యంలో సోమవారం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అయ్యూబ్, జుబేర్ ఖాన్, మౌలానా, అజార్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను సోమవారం బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, కొండారెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి , చెన్నారెడ్డి, భాస్కర్ రెడ్డి, హేమ సుందర్, బ్రహ్మారెడ్డి, పవన్ రెడ్డి, చల్లా ధనంజయ రెడ్డి, శ్రనివాస్ రెడ్డి, సుబ్బారెడ్డి , శ్రీనివాస్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, ధర్మతేజ రెడ్డి, హనిమిరెడ్డి, సుదర్శన్ రెడ్డి ,సుబ్బారెడ్డి, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయం వద్ద సోమవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు వైయస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి ఆధ్వర్యంలో రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుంకేట రవి మాట్లాడుతూ.. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. ప్రజలకు ఉచిత వైద్యం కోసం ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకం, 108అంబులెన్సులు ప్రజలకు ఎంతగానో సేవలందిస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో రాజశేఖర్ రెడ్డి చిరస్మరణీయ నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చి మల్లయ్య, పాలెపు నరసయ్య, వేముల గంగారెడ్డి, ఉట్నూరి ప్రదీప్, పూజారి శేఖర్, దూలూరి కిషన్‌గౌడ్, వేములవాడ జగదీష్, అజ్మత్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

వర్ని : ఉమ్మడి రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సుభాష్ చంద్రబోస్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షులు శీను మాట్లాడుతూ.. వైఎస్ఆర్ పాలనలో ఉచిత వైద్యం, ఒక రూపాయికే కిలో బియ్యం, ఇలా పేద ప్రజలకు ఎన్నో సంక్షేమలు ఇచ్చిన ఘనత వైయస్సార్ రాజశేఖర్‌రెడ్డికి సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో మారుతి, బాబుమియా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి ఉత్సవాలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముత్యంరెడ్డి, మండల కిసాన్ కేత్ కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం సాగర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గడ్డం చిన్నారెడ్డి, నాయకులు పెద్ద రాజన్న, ఆకుల రాజన్న, జైడి చందా రవి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

- కార్పొరేషన్ చైర్మన్లు బాధ్యతలు స్వీకరించడంతో నాయకుల హర్షం

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ధైర్యం ఇస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాడానికి కృషి చేసినందుకు బాల్కొండ నియోజకవర్గ నాయకులకు ముగ్గురికి తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లుగా నియమితులైన సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో టపాకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు. మినరల్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఈరవత్రి అనిల్, కోపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా మానాల మోహన్ రెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా అన్వేష్ రెడ్డిని నియమించడం బాల్కొండ నియోజకవర్గంనికి గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నాయకులకు ధన్యవాదములు తెలుపుతూ వేల్పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం నర్సారెడ్డి ఆధ్వర్యంలో టపాకాయలు పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు మల్లేష్, దామోదర్ గౌడ్, వేల్పూర్ రేవంత్ రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ రాజేందర్, రమణ ఇంద్రాగౌడ్, నరేందర్, రమేష్, మహేందర్, ఆర్మూర్ మోహన్, రమేష్‌మధు, భగవాన్ దాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్ని: బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంచార్జి కాసుల బాలరాజుకు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు టపాసులు కాల్చి మిఠాయిలు పంచి పెట్టుకున్నారు. బాన్సువాడ నియోజకవర్గ అభ్యర్థికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంచి పదవి ఇవ్వడం అభినందనీయమని సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సురేష్ బాబా, సీనియర్ నాయకులు నెమని బుజ్జి, నాగేశ్వర్ రావు, ప్రశాంత్ పటేల్, శనిగరం కిషన్, సంశుద్దీన్, చందు, పలు గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


వర్ని: సంబురాలు చేసుకుంటున్న నాయకులు


ఏర్గట్లలో...

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని భీంగల్ చౌరస్తా వద్ద సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. బాల్కొండ నియోజక వర్గానికి చెందిన ఈరవత్రి అనిల్ తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. చౌరస్తా వద్ద టపాకులు కాల్చారు. . ఈ సందర్భంగా సుంకేట రవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని, నిస్వార్థంగా పార్టీ కోసం కష్టపడ్డ వారికి పదవులు వెతుక్కుంటూ అవే వస్తాయన్నారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఈరవత్రి అనిల్‌కు అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బద్దం రమేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు భువనగిరి భాస్కర్, నాయకులు పూజారి శేఖర్, నిమ్మ రాజేంద్రప్రసాద్, ఉట్నూరి ప్రదీప్, చింతకుంట శ్రీనివాస్, సుంకేట శ్రీనివాస్, వేములవాడ జగదీష్, సుంకరి విజయ్, బైండ్ల శ్రీనివాస్, సుంకరి రాజేశ్వర్, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఏర్గట్ల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పలు సంస్థలకు చైర్మన్లుగా ప్రకటిస్తూ... సోమవారం జీఓ విడుదల చేశారు.ఇందులో భాగంగా ఖనిజ వనరుల అభివృద్ధి చైర్మన్ గా ఈరవత్రి అనిల్, తెలంగాణ సొసైటీ అభివృద్ధి ఛైర్మన్ గా మానాల మోహన్ రెడ్డి పేర్లను ప్రకటించి జీఓ ఇవ్వడంతో దోంచంద, గుమ్మిర్యాల్, నాగేంద్ర నగర్ కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

28న ఊరపండుగ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆషాడ మాసంలో అనవాయతిగా జరుపుకునే పండుగ ఊర పండుగ అని సర్వ సమాజ్ అధ్యక్షులు అర్బన్ మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ తెలిపారు. సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాల పండుగ రోజున జరిగే ఊర పండుగ నాడు గురు పౌర్ణమి రావడం వల్ల మరుసటి ఆదివారం జులై 28న ఊర పండుగ జరుపుకోవాలని సర్వ సమాజ్ కమిటీ సమావేశంలో నిర్ణహించడం జరిగిందని లక్ష్మీనారాయణ తెలిపారు. కావున ప్రజలందరూ పెద్ద ఎత్తున జరిగే ఊర పండుగలొ పాల్గొనలని ఆయన కోరారు.

చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి మృతి

నవతెలంగాణ- మోపాల్


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మండలంలోని సింగంపల్లి గ్రామానికి చెందిన పల్లికొండ నర్సయ్య, (35) చేపలు పట్టడానికి సోమవారం గ్రామ శివారులో గల కొచ్చేరు చెరువుకు వెళ్లారు. చేపలు పట్టేవల కాళ్లకు చేతులకు చుట్టుకోవడం వల్ల చెరువులోపల మునిగిపోయీా మృతిచెందాడు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు మోపాల్ ఎస్సై గంగాధర్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఒక పాప, బాబు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 4 లక్షల అపహరణ


తాళం పగులగొట్టి చిందర వందరగా చేసిన బీరువా

నవతెలంగాణ- నవీపేట్

అప్పు తీర్చేందుకు చిట్టి లేపి తీసుకొచ్చిన నాలుగు లక్షల సొమ్ము అపహరణకు గురైన సంఘటన నవీపేట్ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవీపేట్ మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీకి చెందిన సయ్యద్ మీర్ బీడీ కంపెనీలో పనిచేస్తున్నాడు. తనకున్న 4 లక్షల అప్పును తీర్చడం కోసం చిట్టిలేపి డబ్బులు తీసుకువచ్చి బీరువాలో దాచాడు. తమ దగ్గర బంధువులను పరామర్శించేందుకు శనివారం కుటుంబ సభ్యులంతా కలిసి నందిపేట్ కు వెళ్లారు. సోమవారం ఇంటికి రాగా తలుపులు పగులగొట్టి బీరువా తెరిచి ఉండడంతో చూడగా 4 లక్షల రూపాయలు దొంగతనానికి గురైనట్లు తెలుసుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఎస్ఐ యాదగిరి గౌడ్, డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ క్లూస్ టీంతో సంఘటన స్థలానికి వచ్చి ఆధారాల కోసం పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. కాగా ఈ మధ్యకాలంలో దొంగతనాలు తరచూ జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో డిజె శాంతి ఆధ్వర్యంలో హిందీ విద్వాన్, భూషణ్ పరీక్షలను నిర్వహించారు. అందులో ఉత్తీర్ణులైన విద్యార్థినులకు సోమవారం కళాశాల ఆవరణలో సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దేవరాం, పిడి గంగాధర్, అధ్యాపకులు ఇర్ఫాన్, గంగారాం, రాజకళ, స్వాతి, వనిత, మహేందర్, వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ మురళి, కృష్ణ, లైబ్రేరియన్ నరేష్ రెడ్డి, పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే.. పోచారం కావాలి

- కాంగ్రెస్ నాయకులు


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గంలో గత పాలనలో మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి కావాలంటే మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివా స్‌రెడ్డితో అంద రం కలసి ఉండాలని మం డల అధ్యక్షులు సురేష్ బాబా, సీనియర్ నాయకులు నెమని విరాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలోకి పోచారం శ్రీనివాస్‌రెడ్డి రావటం అభివృద్ధి కోసమే, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు నియోజకవర్గంలో కనిపించాలంటే గత తెలంగాణ ప్రభుత్వంలో ఆయా కట్టు రైతుల కోసం నిర్మాణంలో ఉన్న చందూర్, జాకోరా గ్రామాలలో లిఫ్ట్ ఇరిగేషన్‌లు, చందూర్ నుంచి మోస్రా మండలాల మధ్య డబుల్ రోడ్డు, పేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇలా ఎన్నో అభివృద్ధి సంక్షేమ పతకాలు పోచారం శ్రీనివాస్‌రెడ్డితో సాధ్యం అవుతాయన్నారు. అందరం కలసి, మెలసి గ్రామాల, మండలాల అభివృద్ధి కోసం పని చేద్దామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ టౌన్ ప్రెసిడెంట్ ప్రశాంత్ పటేల్, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎండి భారీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాగేశ్వరరావు, శనిగారం కిషన్, మండల మైనార్టీ అధ్యక్షులు శంషుద్దీన్, నరేంఢ్ల గోవర్ధన్, నరేంఢ్ల సాయిలు, దయాకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

రియల్‌ఎస్టేట్ వ్యాపారులపై ఆర్డీవోకు ఫిర్యాదు


ఆర్డీవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

నవతెలంగాణ-బోధన్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద పనులు చేసు కుంటున్న డాక్యు మెంట్ రైటర్లు సోమవారం ఆర్డీఓ అంబదాస్ రాజే శ్వర్‌కు ఫిర్యాదు చేశారు. డాక్యు మెంట్ రైటర్లు ప్రజల నుండి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ఇబ్బందులు పెడుతున్నారని రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెండు రోజుల క్రితం ఆర్డీవోకు ఫిర్యాదు చేశారని, అది సహజం కాదని డాక్యుమెంట్ రైటర్ల ప్రతినిధి హరికాంత్ చారి అన్నారు. ప్రజల ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి సక్రమంగా పత్రాలు రాస్తున్నామని, ఇదే మాకు ఉపాధి అని అన్నారు. కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ ఉపాధి దెబ్బతీయడానికి కుట్రలు చేయడం సమంజసం కాదన్నారు. తమపై అధికారులకు ఫిర్యాదు చేయడం తమను ప్రజల్లో చులకన చేయడానికి ప్రయత్నించడం లాంటి పనులు మానుకోవాలని అన్నారు, అందులో భాగంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులపై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీవోకు విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై బెల్టుల పంపిణీ

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని సుంకేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందమంది విద్యార్థులకు టై, బెల్ట్, షూలు, బుక్స్ పంపిణీ చేశారు. ఒక్కొక్క విద్యార్థికి గాను 500 రూపాయల సామాగ్రిని పంపిణీ చేసినట్లు జీహెచ్ఎం పెద్ది సంతోష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పప్పుల సంపత్, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.



పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ దాడి

- ఐదుగురు అరెస్ట్

నవతెలంగాణ - మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశానుసారం టాస్క్ ఫోర్స్ ఏసీపి విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సీఐ పురుషోత్తం పేకాట స్థావరంపై దాడి సోమవారం చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకొని వారి వద్ద రూ. 14 వేలు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్థానిక పోలీసులకు అప్పగించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లస్మన్న , రాజేశ్వర్, సిబ్బంది గజేందర్, అనిల్, ఆజం ఉన్నారు.



ప్రభుత్వ భూములకు పట్టాలు

- స్విఫ్ట్ కారు ఇచ్చి ఐ20 తీసుకొని మొరం మాఫియాకు గ్రీన్ సిగ్నల్
- ఎకరాకు లక్ష ఇస్తే అసైన్డ్ పట్టా
- మధ్యవర్తులతో అసైన్డ్ దాందా

నవతెలంగాణ-మాక్లూర్

మీ అసైన్డ్ భూమి పట్టాగా మారాలంటే అక్షరాల రూ. లక్ష చెల్లించుకుంటే ఇట్టే మారిపోతుంది. ధరణిలో ఆన్‌లైన్‌లో కూడా పేరు వస్తుంది. ఈ తంతు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో అధికారులు చేస్తున్న తీరు. మండలంలో అసైన్డ్ భూముల పట్టాల మార్పిడి దర్జాగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూములను పట్టాలను మార్పిడి చేసి నూతన పట్టాలు ఇస్తున్నారు. అసైన్డ్ భూములు అమ్మడం కాని, కొనుగోలు చేయడం కాని పూర్తిగా నిషేధం. ఈ భూములన్నీ కూడా నిషేధిత జాబితాలో ఉంటాయి. ఒకవేళ అసైన్డ్ పట్టాదారుడు మరణిస్తే వారి కుటుంబ సభ్యుల పేరిట పట్టాను బదిలీ చేయించుకోవడానికి అవకాశం ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం ఆ నిబంధనలేవీ వర్తించవు. సాదాబైనామాల పేరిట కొనుగోలు చేసిన అసైన్డ్ భూములను దర్జాగా ఆన్లైన్లో పట్టాలుగా మార్పిడి చేస్తున్నారు. మండలంలోని గొట్టుముక్కల, చిక్లీ, లక్మాపూర్, మెట్టుపల్లి, మెట్టు, మాదాపూర్ తదితర గ్రామాల్లో అసైన్డ్ భూములను పట్టాలుగా మార్చిన సంఘటనలు ఉన్నాయి.

గత తహశీల్దార్ అడుగుజాడల్లో..



ఇంతకు ముందు ఉన్న తహశీల్దార్ కొన్ని చేసి వెళ్ళారని మండలవాసులు ఆరోపిస్తున్నారు. ఆయన అడుగు జాడల్లోనే ప్రస్తుత తహశీల్దార్ ముందుకు సాగుతున్నట్లు చర్చించుకుంటున్నారు.

మొరం దందాకు అండగా...

మండలంలోని దాస్‌నగర్ సమీపంలో గల ఓ మొరం వ్యాపారితో లోపాయి కరి చేసుకొని తహశీల్దార్‌కు గల తన స్విఫ్ట్ కారు ఇచ్చి వ్యాపారి యొక్క ఐ20 కారును బహుమతిగా తీసుకొని దర్జాగా మండల కార్యాలయానికి వస్తున్నారు. వ్యాపారి మండలం నుంచి ఎంత మొరం జిల్లా కేంద్రానికి తరలించిన అంతా ఉచితమే.

మండల కార్యాలయంలో ఉన్నత అధికారులు విచారణ చేపట్టలని అసైన్డ్ భూముల బాగోతాన్ని అరికట్టలని స్థానికులు కోరుతున్నారు.

వారసత్వం మాత్రమే చేశాను
తహశీల్దార్ షబ్బీర్

ఇతరుల అసైన్డ్ భూముల పట్టాలు చేయలేదు. వారసత్వం మాత్రమే చేశాను.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- ఏఐపికే ఎంఎస్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వ్యవసాయ కూలీలకు సమగ్రమైన చట్టం తేవాలని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 12వేల పెన్షన్ అమలు చేయాలని, బీడీ, గీత కార్మికులకు నెలకు 2016 రూపాయలు ఇస్తున్నట్టు వ్యవసాయ కార్మికులకు అందించాలని నిజామబాద్ కలెక్టరేట్ ఎదుట అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపికే ఎంఎస్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా, కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐ పీకేఎంఎస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి చంద్రపుసాయ గౌడ్, జి కిషన్ మాట్లాడుతూ.. నిత్యావసర ధరలకు అనుగుణంగా రూ.600 సమగ్రమైన వ్యవసాయ కార్మికుల చట్టం తెచ్చి 50 సంవత్సరాల పైయపడిన వారికి నెలకు పదివేల రూపాయల చొప్పున పెన్షన్ అందించాలని. హెల్త్ కార్డు అందించాలని ఇండ్ల నిర్మాణానికి పది లక్షల రూపాయల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికులకు ఇస్తున్నట్లుగా నెలకు 2016 ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ మరియు గీత కార్మికులకు ఎన్నికల సందర్భంగా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ 4వేల రూపాయలు పెంచుతామని హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గంగన్న,రాజేశ్వర్, గంగమల్లు, అశోక్, నజీర్, సాయిబబా, మోహన్, పోశెట్టి, ఒడ్డెన్న తదితరులు పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వం

- కిషన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ముస్కు నర్సయ్య



ముప్కాల్ : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్/బాల్కొండ

రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అధికారంలో కొనసాగుతుండడం సిగ్గుచేటని కిషన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ముస్కు నర్సయ్య అన్నారు. మండలంలోని బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఇంఛార్జి తహశీల్దార్ పి.శ్రీకాంత్‌కు మెమోరాండం సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా కిషన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు బంధు రూ.15వేలు, రైతు రుణమాఫీ రూ.2 లక్షలు, రైతు పసల్ భీమా, కౌలు రైతులకు రూ.12వేలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్, మెడికల్ విక్రం, కే ఏం.రెడ్డి, మ్యాక నర్సయ్య, పెంటు గంగాధర్, శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్కొండ: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ సోమవారం బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీధర్ కు వినతిపత్రం అందజేశారు. రుణమాఫీ కాని కారణంగా బ్యాంకుల్లో రైతులు అపరాదుల్లా తలవంచుకోవాల్సి వస్తుందని, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు అందిస్తామఅన్న ఆర్థిక తోడ్పాటు విషయంలో ఈ ప్రభుత్వం ఇంకా నోరు మెదపకపోవడం దుర్మార్గం అని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా అధ్యక్షులు తిరుపతిరెడ్డి, మండలాధ్యక్షుడు ఆరేపల్లి నర్సయ్య, బిజెపి మండల అధ్యక్షుడు అంబటి నవీన్, రాజలింగం, చేపూర్ గంగాధర్, ఠాగూర్ రాము, రామ్ కిషన్, రామన్ శివ, కన్నారెడ్డి, సల్ల నరసయ్య , కిసాన్ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

బాస పోశెట్టి సేవలు అజరామరం

- 23వ వర్ధంతి సందర్భంగా పేదలకు చీరలు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్



హాజరైన మహిళలు

పేద ప్రజల కోసం, పద్మశాలీ కులస్తుల అభివృద్ధి కోసం బాస పోశెట్టి అహర్నిశలు చేసిన సేవలు అజరామరం అని పలువురు వక్తలు అన్నారు. బాసపోశెట్టి 23వ వర్ధంతి సభ సోమవారం మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ భవనంలో ఐద్వా మహిళ సంఘం, బాసపోశెట్టి కుటుంబ సభ్యులు సంయుక్తంగా నిర్వహించారు. అతిథిగా హాజరైన డాక్టర్ సూరి మాట్లాడుతూ.. బాసపోశెట్టి పేదల వైద్యం కోసం 30 సంవత్సరాల క్రితమే గుండె జబ్బుల బారిన పడిన పేదల కోసం రెండు లక్షల రూపాయలు ప్రగతి హాస్పటల్‌కు విరాళంగా ఇచ్చారని తెలిపారు. అనేక సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారన్నారు. పద్మశాలి సంఘం అధ్యక్షులు దీకొండ యాదిగిరి, పులగం హనుమాన్లు, వెంకట నరసయ్య తదితరులు మాట్లాడుతూ.. పేద విద్యార్థుల కోసం హాస్టల్ ను ప్రారంభించారని, చదువుకోసం విద్యార్థులకు ఫీజులు కట్టేవారని అన్నారు. ప్రముఖ న్యాయవాది బాస రాజేశ్వర్ మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటంతో పాటుగా తమ కుటుంబ సభ్యులందరికీ ప్రజల కోసం బతకాలని ఉద్బోధించారన్నారు. ఈ సందర్భంగా 26మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాస పోశెట్టి కుటుంబ సభ్యులు, సరోజ, దక్ష, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అనిత, ప్రధాన కార్యదర్శి సుజాత ఉపాధ్యక్షురాలు లావణ్య పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న సంఘం నాయకులు

ప్రజలకు అందించిన సేవలే కొలమానం



మాజీ ఎంపీటీసీ తోటజ్యోతినిని సన్మానిస్తున్న మాజీ సర్పంచ్, తదితరులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పదవులు శాశ్వతం కాదని, పదవిలో ఉన్నప్పుడు మన ప్రవర్తన అందించిన సేవలనే ప్రజలు గుర్తిస్తారని మాజీ సర్పంచ్ సక్కారం అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ ఆవరణలో ఎంపీటీసీ తోట జ్యోతి మనోహర్ పదవి విరమణ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ సక్కారం అశోక్, ఉప సర్పంచ్ విక్రమ్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సక్కారం అశోక్ మాట్లాడుతూ.. ఎంపీటీసీ సభ్యురాలుగా జ్యోతి గ్రామానికి అమూల్యమైన సేవలు అందించారన్నారు. తమను ఎన్నుకున్న ప్రజలకు, అందించిన సేవలే నాయకుని గుర్తింపునకు నిదర్శనంగా నిలుస్తాయన్నారు. అధికారులతో మర్యాదపూర్వకంగా మసులుకొంటూనే గ్రామ అభివృద్ధికి, లబ్ధిదారులకు అన్ని ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేశారని కొనియాడారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు ఎస్.నారాయణ, బాశెట్టి గంగాధర్, నెల్ల రమేష్, ఎర్రవ్వ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్
- విద్యార్థులందరికీ ఆరోగ్యపరీక్షలు చేయాలి
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్,
- జింక్ కార్నర్స్ ను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణ కోసం సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ నీటి నిల్వలను తొలగించి పైపులైను లీకేజీలకు మరమ్మతులు చేయించి శుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని, తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ మిగతా అన్ని శాఖలతో సమన్వయం ఏర్పరచాలని, ముఖ్యంగా పంచాయతీరాజ్, రూరల్ వాటర్ సప్లై, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఫిషరీస్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, విద్యాశాఖ డిఆర్డిఏ, మున్సిపల్, పబ్లిక్ రిలేషన్ లాంటి శాఖలతో కోఆర్డినేషన్‌తో పనిచేయాలన్నారు. మలేరియా, డెంగీ, చికన్ గున్యా లాంటివి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ, గ్రామస్థాయి నుండి ప్రజలకు, పాఠశాలలో, కళాశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. వసతిగృహాలు, గురుకులాలు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వారానికి రెండుసార్లు సందర్శించి విద్యార్థులందరికీ ఆరోగ్యపరీక్షలు చేసి చికిత్సలు అందించాలని సూచించారు. కీటకజనిత వ్యాధులతో పాటు డయేరియా నివారణకు ధీమాస ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు. చిన్నారులు డయేరియాకు గురికాకుండా ఆరు శాఖలతో సమన్వయ పరచుకుని తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్, జింక్ కార్నర్స్ ను ఏర్పాటు చేయాలని, రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ను, సరిపడా మందులను అందుబాటులో ఉంచుకొని ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా సీజనల్ వ్యాధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పిపిటి స్ట్రాటజీ రక్షించు కోవడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, చికిత్స చేయడం వంటివి పాటించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ మకరందు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్, డీఐఓ డాక్టర్ అశోక్, డి ఆర్ డి ఓ సాయాగౌడ్, డిడబ్ల్యుఓ రసూల్ బీ, విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతి మొక్క సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

- గ్రామాల్లో, పాఠశాలల్లో నాటిని అధికారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ఆర్మూర్/ముప్కాల్

నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని నాగపూర్ గ్రామంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. గ్రామంలోని మహిళా సంఘాల ద్వారా ఇంటింటికి మొక్కల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఒక్కటే పరిష్కారం అన్నారు. ప్రస్తుతం మనం నాటిన మొక్కలే వృక్షాలై మన భవిష్యత్తు తరాలకు ప్రాణ వాయువును అందిస్తాయన్నారు. నాటిన మొక్కలను కాపాడేందుకు ప్రజలు బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, పంచాయతీ కార్యదర్శి సంధ్య ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ మహిళా సంఘాల అధ్యక్షులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో మొక్కలు అందజేస్తున్న అధికారులు

ఆర్మూర్ : పట్టణ కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం గ్రీన్ ఇండియా మిషన్‌లో భాగంగా పాఠశాల ఆవరణలో హైస్కూల్, ప్రైమరీ విద్యార్థులు సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ముత్తు నందిపాటి మాట్లాడుతూ సమాజంలో ఉన్నతమైన పాత్ర పోషించడం కోసం స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు మొక్కలు నాటారు. ప్రతిఒక్కరు మొక్కలు నాటి దేశాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. మొక్కలు నాటడం సమాజ హితం అని మొక్కలు మానవ మనుగడకు మూలాధారమైనవని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ముత్తు, ప్రైమరి కో ఆర్డినేటర్ ప్రసన్న, డీన్ రాకేష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మండలంలోని పిప్రి, ఫతేపూర్ గ్రామాల్లో వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిరాం, ఎంపీఓ శ్రీనివాస్, పిప్రి పిఎసిఎస్ చైర్మన్ సోమ హేమంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆశాపురం శ్రీనివాస్ రెడ్డి, ఏపీవో సురేష్, ఈసీ ప్రశాంత్, టీఏలు నరేష్, రాము భరత్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముప్కాల్: వనమహోత్సవం'ను పురస్కరించుకుని రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎన్జీసీ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు జె.రవి కుమార్, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు సామ ప్రసాద్, మల్లేశం మొక్కలను నాటారు. ప్రధానోపాధ్యాయులు జె.రవి కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఒక మొక్కను నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, దేవసాయం, మోహన్, శ్రీనివాస్, మదార్, మురళీ, గోపి, గంగాధర్, అనుపమ, విద్యార్థులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి : మొక్కలు నాటుతున్న ఎంపీడీవో, అధికారులు, సిబ్బంది, మహిళలు

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT: KAMAREDDY
(In the matter of Indian Succession Act)
S.O.P.No. 07 of 2024

Between:-
Muriki Vasantha and other
... Petitioners.
And
1. The Manager Canara Bank, Kamareddy & an others.
...Respondents.

To,
1. The Manager Canara Bank kamareddy branch, Kamareddy town & dist.
2. Whom so ever it may concern
..Respondents

Whereas the petitioners filed the above S.O.P. for Succession Certificate for settlement of death claim of Muriki Shekaram (Locker, no. 146) laying at Respondent No.1, towards Locker no.146, of Late Muriki shekaram the said case is posted on. **02-08-2024,** for appearance and filing counter. Therefore if any person or persons having any claim, right or interest etc., you are hereby required to appear in person or through advocate on the said date before this court, on **02-08-2024, at 10.30 A.M** in the said court, otherwise the case will be decided. in your absence.

// BY THE ORDER OF COURT//

P. GOVIND RAO,
M.A.LL.B. LL.M.
ADVOCATE & NOTARY
1st Street Viduth Nagar Colony, H.NO. 4-67/2A Devanpally, village, Mandal& dist.Kamareddy, Pin. 503112.Cell no.9441202589.
(The counsel for the petitioners)

BEFORE THE HON" BLE II ADDL DIST JUDGE NIZAMABAD
I.A. No. 57 /2019
IN
O.S. 49 of 2013

Between:-
Gaddam Jagan Mohan Reddy S/o Late Gaddam Rajeshar Reddy, aged about 69 years. Occ: Retired Banker & Agriculture, R/o H. No. 5-15 to 524. Mortad village and Mandal, District Nizamabad and now residing at H.No. 6-3-1119/1, B.S. Makhta, Somajiguda.Hyderabad.
...Petitioner/Plaintiff
And
The State of Andhra Pradesh, represented by and through the District Collector Nizamabad and others.
...Respondents/Defendants

To,
Respondents No. 9 & 18,
1. M.A Khalil S/o Jani Mohammadan, Hindu, Occ: Agriculture, R/o Mortad village and Mandal, District Nizamabad. (Respondent 9)
2. Chinna Reddy S/o Ganga Reddy, Hindu, Occ: Agriculture, R/o Mortad vill and Mandal, District Nizamabad. (Respondent No. 18)
Respondents /Defendants No 9 & 18

Whereas the above-named petitioner has filed the above petition U/s 5 of limitation Act for several times from the Hon'ble court but could not be served on the respondents. You are hereby required to appear before the above said Hon'ble Court on **23-07-2024** at 10.30 a m. either in person or through pleader. If you fail to appear before the above court. the matter will be decided in your absence.

// BY ORDER OF THE COURT //
GV. KRUPAKAR REDDY
Advocate, Nizamabad.

IN THE COURT OF THE HON'BLE JUNIOR. CIVIL JUDGE AT NIZAMABAD.
O.S. NO. 204 OF 2018

BETWEEN:-
Telangana Grameena Bank Nizamabad, Nizamabad Branch Represented by its Branch Manager, Khaleelwadi, Pochammagalli, Nizamabad.
..Plaintiff
AND
1. Arshiya Fathima D/o Mohammed Abdul Jaleel, Age 26 years, Occ: Business, R/o H.No 8-4-38/4, Dharugally, Nizamabad
2. Noor Jahan Ara D/o Dilwar Khan, Age Adult, Occ. Business, R/o H.No. 10-12-159. Quilla Cross Roads, Gjulpet, Nizamabad.
3. Anees Begum W/o Mohammed Azaruddin, Age: Adult. Occ. Business. R/o H.No. 10-12-159. Quilla Cross Road, Gajulpet, Nizamabad
...Defendants

To,
Anees Begum W/o Mohammed Azaruddin, Age: Adult, Occ Business, R/o H.No. 10- 12-159, Quilla Cross Road, Gajulpet. Nizamabad. (Defendant No 3)

Whereas the above-named Plaintiff has filed a Suit for recovery of money Amount Several times notices were sent to you, the said notices were returned Un served.

Take notice that the above case is posted on **25/07/2024 at 10:30** AM. for your appearance. You are hereby required to appear either in person or through a pleader. before the above said court on the aforesaid date and time, failing which the matter will be decided in your absence.

// BY ORDER OF THE COURT //
G.V. KRUPAKAR REDDY
C. SAIREDDY
Advocate,
'SRI NILAYAM' #5-9-64, Road no. 1. Yellammagutta, NIZAMABAD.

BEFORE THE HON" BLE II ADDL. DIST JUDGE AT NIZAMABAD.
I.A No. 56 /2019
IN
O.S. 49 of 2013

Between-
Gaddam Jagan Mohan Reddy S/o Late Gaddam Rajeshar Reddy, aged about 69 years. Occ: Retired Banker & Agriculture, Ro H. No. 5-15 to 524, Mortad village and Mandal, District Nizamabad and now residing at H.No. 6-3-1119/1, B.S. Makhta, Somajiguda Hyderabad.
..Petitioner/Plaintiff
And
The State of Andhra Pradesh, represented by and through the District Collector Nizamabad and others
...Respondents/Defendants

To,
Respondents No. 9 & 18,
1. M.A. Khalil S/o Jani Mohammadan, Hindu, Occ: Agriculture, R/o Mortad village and Mandal, District Nizamabad (Respondent 9)
2. Chinna Reddy S/o Ganga Reddy, Hindu, Occ. Agriculture, R/o Mortad vill and Mandal, District Nizamabad. (Respondent No18)
Respondents/Defendants No 9 & 18

Whereas the above-named petitioner has filed the above petition U/Order IX rule 9, R/w 151 CPC for restoring the suit dismissed for default. Notices were sent several times from the Hon'ble court but could not be served on the respondents. You are hereby required to appear before the above said Hon'ble Court on **23-07-2024** at 10.30 am either in person or through pleader. If you fail to appear before the above court, the matter will be decided in your absence.

// BY ORDER OF THE COURT //
GV. KRUPAKA REDDY
Advocate, Nizamabad.